కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

# BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -210 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 11-08-2026 మంగళవారం పేజీలు : 4




# ఓటర్ల జాబితాలో భారీ కోత!

- 74 లక్షల ఓట్లకు కోత!
- హైదరాబాద్‌లో భారీ షాక్
- మూడు జిల్లాల్లోనే 43 లక్షలు
- డూప్లికేట్ ఓట్ల ఏరివేత
- ముసాయిదాతో కొత్త రగడ
- బీఎల్‌వోలపై తీవ్ర ఆరోపణలు
- తుది జాబితాపై ఉత్కంఠ
- కొత్త పోలింగ్ బూత్‌లు

**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియతో 74లక్షల ఓట్లు తొలగనున్నాయి. ఇందులో ఔటర్ రింగ్ రోడ్ లోపలే దాదాపుగా 43 లక్షల ఓట్ల వరకు తొలగనున్నాయి. దాదాపుగా ప్రతి జిల్లాలో 50 వేల నుంచి లక్ష ఓట్ల వరకు తొలుగుతున్నాయి. ఇందులో ఎక్కువగా ఒకరికే రెండు ఓట్లు ఉండటం, ఆ తరువాత చనిపోయిన వారు, షిఫ్టింగ్ అయిన వారు ఎక్కువగా ఉన్నారని గుర్తించారు. ఆదివారం సాయంత్రం వరకు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించిన అధికారిక లెక్కలే వీటిని స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్రంలో ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు రెండు సార్లు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పెంచింది. ఈ నేపథ్యంలో రావాల్సిన ఫారాలు అత్యధికం వచ్చాయని, ఈ రెండు రోజుల్లో తక్కువగానే వస్తాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. జూన్ 25న ప్రారంభమైన ప్రక్రియ 45రోజుల గడువును కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 74లక్షల ఓట్లు తొలగించడం ఖాయమైంది. సోమవారంతో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు ముగిసింది. ఈనెల 17న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

మిగతాది 2 లో..

# ట్రిబ్యునల్స్‌పై కేంద్రం కీలక నిర్ణయం!

- లోక్‌సభలో బిల్లుకు ఆమోదం
- మూజువాణి ఓటుతో బిల్లు పాస్
- విపక్షాల నిరసనల మధ్యే ఆమోదం
- ట్రిబ్యునళ్లలో నిబంధనలకు ఏకరూపత
- అనవసర ట్రిబ్యునళ్లకు ఇక చెక్
- త్వరిత న్యాయానికి కొత్త మార్గం


2 లో

**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** పార్లమెంట్‌లో ప్రతిపక్షాల తీవ్ర నిరసనలు, హోరెత్తించే నినాదాల మధ్యే లోక్‌సభ అత్యంత కీలకమైన 'ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు-2026' కు ఆమోదం తెలిపింది. విపక్షాలు లేవనెత్తిన ఆందోళనల దృష్ట్యా ఎలాంటి ముందస్తు చర్చ లేదా ఓటింగ్ లేకుండా, మూజువాణి ఓటు ద్వారానే సభ ఈ బిల్లును క్లియర్ చేసింది.

# పెద్ది విగ్రహంపై రగడ!


2 లో

- పెద్ది విగ్రహాన్ని ఆవిష్కరించిన బీఆర్ఎస్ శ్రేణులు
- పోలీసులు, కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం
- మాజీ మంత్రుల ఆధ్వర్యంలో భారీ ధర్నా
- మెడికల్ కాలేజీ వద్ద భారీగా పోలీసుల మోహరింపు
- అనుమతులపై కొనసాగుతున్న సందిగ్ధత

# డీఎస్సీ రగడ.. బాబు ఫైర్!

- వైసీపీ ఆందోళనలకు కౌంటర్
- రోడ్లపై రచ్చ సహించను
- ప్రజలకు ఇబ్బందులు వద్దు
- రౌడీలకు సింహ స్వప్నం
- డీఎస్సీపై కీలక వ్యాఖ్యలు
- అభివృద్ధిపై క్రెడిట్ వార్



**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** డీఎస్సీ విషయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఏలూరు జిల్లా పర్యటనలో కైకలూరు, కలిదిండి సభలో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. అయితే ఉద్యోగాలు ఇవ్వకుండా కొందరు కోర్టులను ఆశ్రయించారని, అనంతరం కోర్టులో ఉన్న అంశాలను పరిష్కరించి ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది తర్వాత వైసీపీ రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తోందని చంద్రబాబు విమర్శించారు. ఢిల్లీలో నీట్ లీక్ జరిగితే ఇక్కడ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రస్తుతం డీఎస్సీ అభ్యర్థుల పేరుతో అనవసర ఆందోళనలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

2 లో

# పాలమూరుకు కేంద్రం షాక్!


2 లో

- జాతీయ హోదాపై కేంద్రం క్లారిటీ
- ప్రతిపాదన లేదన్న కేంద్ర ప్రభుత్వం
- డీపీఆర్‌ను వెనక్కి పంపిన కేంద్రం
- కృష్ణా జలాలపై స్పష్టత కరవు
- ఆర్థిక సాయంపైనా తుది నిర్ణయం లేదు

# చిన్నారులకు నిమ్స్ వరం!



2 లో

- ఆగస్టు 13 నుంచి ఉచిత ఆపరేషన్లు ప్రారంభం
- లండన్ వైద్యుల సహకారంతో ప్రత్యేక చికిత్సలు
- వైద్య పరీక్షల అనంతరం శస్త్రచికిత్సలకు ప్రాధాన్యం
- వాక్ఇన్ విధానంలో చిన్నారుల పరిశీలన
- ఐదేళ్లుగా కొనసాగుతున్న ఉచిత హార్ట్ సర్జరీలు
- వైద్య రిపోర్టులతో నిమ్స్‌ను సంప్రదించాలని సూచన

# ఏపీలో ఎన్నికల సందడి!

- స్థానిక పోరుకు రంగం సిద్ధం
- కోర్టు తీర్పులపై ఉత్కంఠ
- 13,341 పంచాయతీలపై ఫోకస్
- 87 సంస్థలకు ఎన్నికలు
- వార్డుల పునర్విభజనపై దృష్టి
- ఎన్నికలకు శాఖల సన్నాహాలు


2 లో

**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఎన్నికల సన్నద్ధతపై వేర్వేరుగా నివేదికలు సమర్పించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నివేదిక ప్రకారం.. డివిజన్లు, వార్డుల పునర్విభజనకు సంబంధించిన కేసుల్లో కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన 20 రోజుల్లో సుమారు 100 పురపాలికలు, నగర పంచాయతీల్లో అవసరమైన ప్రక్రియను పూర్తి చేయగలమని వెల్లడించింది. 2021లో ఎన్నికలు జరిగిన 100 పురపాలికలు, నగర పాలక సంస్థలు, నగర పంచాయతీల్లో 87 చోట్ల పాలకవర్గాల పదవీకాలం మార్చితో ముగిసింది. మరో 13 చోట్ల పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది నవంబర్ 22 వరకు కొనసాగనుంది. పదవీకాలం ముగిసిన 87 స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పురపాలక శాఖ ఎస్ఈసీకి తెలిపింది.

# లాఠీచార్జ్‌పై కాంగ్రెస్ పట్టు!

- లాఠీచార్జ్‌పై ప్రకటనకు డిమాండ్
- ప్రకటన వచ్చే వరకు డెడ్‌లాక్
- పార్లమెంట్‌లో కొనసాగుతున్న ప్రతిష్టంభన
- ప్రియాంక గాంధీ స్పష్టమైన హెచ్చరిక
- కీలక బిల్లుల భవితవ్యంపై ఉత్కంఠ

# తమిళ తాయ్ వాజ్తుకు గౌరవం

- తమిళ గీతానికే ఫస్ట్
- అసెంబ్లీలో కీలక తీర్మానం
- వందేమాతరంపై వివాదం
- అన్ని పార్టీల ఏకాభిప్రాయం
- ప్రభుత్వ కార్యక్రమాల్లో మార్పు
- తమిళ అస్తిత్వంపై ఏకతాటిపై



**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** తమిళనాడు అస్తిత్వం విషయంలో ఆ రాష్ట్ర శాసనసభ వేదికగా రాజకీయ పక్షాలన్నీ మరోసారి ఏకతాటిపైకి వచ్చాయి. ఇకపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యాసంస్థల్లో రాష్ట్ర గీతం 'తమిళ తాయ్ వాజ్తు' ను అన్నింటికంటే ముందు ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ సోమవారం సీఎం విజయ్ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు అక్కటి కావడంతో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ తమిళభాష ప్రాచీనత, తమిళ నాగరికతను కాపడటమే తమ లక్ష్యం అని చెప్పారు.

2 లో

# యుద్ధానికి ట్రంప్ ఎండ్ కార్డ్!

- హోర్ముజ్ జలసంధి తెరిస్తే సరేనన్న ట్రంప్
- కాల్పుల విరమణ పొడిగింపుపై అమెరికా దృష్టి
- మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ వ్యూహం
- యుద్ధంపై అమెరికన్లలో పెరుగుతున్న అసంతృప్తి
- చమురు రవాణాకు హోర్ముజ్ కీలక మార్గం
- అమెరికా ముందు ఇరాన్ కీలక డిమాండ్లు

2 లో

# జార్ఖండ్‌లో జేపీఎస్సీ సెగ!

- జేపీఎస్సీ మాజీ చైర్మన్ అరెస్ట్
- నియామక పరీక్షల్లో అక్రమాల ఆరోపణలు
- సీఐడీ విచారణలో కీలక పరిణామం
- అభ్యర్థుల ఆందోళనతో ఉద్రిక్తత
- విద్యార్థులపై లాఠీచార్జ్
- వాటర్‌గన్, టియర్‌గ్యాస్ ప్రయోగం
- అరెస్టుతో రాజకీయ కలకలం

2 లో

# లాఠీచార్జ్‌పై కాంగ్రెస్ పట్టు!



**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** మెంట్‌లో ప్రకటన చేసే వరకు ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న స్తంభన (డెడ్‌లాక్) విడదని కాంగ్రెస్ నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. వర్షాకాల సమావేశాలు ముగియడానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో, తీవ్ర నిరసనల నడుమ మహిళా సంరక్షణ (మహిళా రిజర్వేషన్), నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), విదేశీ నిధుల క్రమబద్ధీకరణ సవరణ చట్టం వంటి కీలక బిల్లుల భవితవ్యం అనిశ్చితిలో పడింది. సోమవారం లోక్‌సభ అజెండా జాబితాలో కూడా ఈ బిల్లులు చోటుచేసుకోలేదు. పార్లమెంట్ ప్రాంగణంలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ మంత్రి స్వయంగా ప్రకటన చేస్తేనే సభ సజావుగా సాగుతుందని తేల్చి చెప్పారు.

ప్రభుత్వం జరిపిన చర్చల అనంతరం మహిళా కోటా, డీలిమిటేషన్ బిల్లులపై కొన్ని ప్రతిపక్షాలు కొంత మెత్తబడినప్పటికీ, కాంగ్రెస్తో పాటు దాని భాగస్వామ్య పక్షాలు మాత్రం ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుతో సహా ఇతర బిల్లులను గట్టిగా అడ్డుకోవాలని నిర్ణయించాయి. ఎన్‌జీఓలు, మైనారిటీ సంస్థలను లక్ష్యంగా చేసుకుని తెస్తున్న ఎఫ్‌సిఆర్ఎ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ప్రజా వ్యతిరేకమని ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు. ఒకవేళ కేంద్రం బలవంతంగా ఈ బిల్లును ఆమోదింపజేయాలని చూస్తే పార్లమెంట్‌లో తీవ్ర నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విదేశీ నిధులు పొందే సంస్థలపై కఠిన ఆంక్షలు విధించేలా రూపుదిద్దుకున్న ఈ బిల్లును పలు క్రైస్తవ సంస్థలు, రాజకీయ పక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జూలై 20న ప్రారంభమైన ఈ వర్షాకాల సమావేశాలు ప్రతిపక్షాల వరుస నిరసనలు, వాయిదాల నడుమ దాదాపు ఏమాత్రం సాగలేదు. కేవలం పోటీ పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లు-2026తో పాటు, కొన్ని చిన్న బిల్లులు మాత్రమే చర్చ లేకుండా ఆమోదం పొందాయి.

# చిన్నారులకు నిమ్స్ వరం!




**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారులకు పూర్తిగా ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవరాజ్ తెలిపారు. నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్ఓడీ ప్రొ. అమరేశ్వర్ నేతృత్వంలో ఈ ఏడాది ఆగస్టు 13 నుంచి ఈ శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. లండన్‌కు చెందిన వైద్యులు, పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డా.రమణ తన్నషునేని, సాంకేతిక నిపుణుల బృందం సహకారంతో ఈ ప్రత్యేక శస్త్రచికిత్సలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత ఐదేళ్లుగా ప్రతి సంవత్సరం నిమ్స్‌లో ఈ ఉచిత గుండె శస్త్రచికిత్స కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

వాక్ ఇన్ విధానంలో చిన్నారుల పరిశీలన:

అవసరాన్ని బట్టి ప్రాధాన్యత కేటాయిస్తూ వాక్-ఇన్ విధానంలో చిన్నారులను పరిశీలిస్తామని దేవరాజు తెలిపారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం శస్త్రచికిత్స అవసరమున్న చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఇందుకోసం సోమవారం నుంచి శనివారం వరకు, ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు సీటీ సర్జరీ కార్యాలయం, మొదటి అంతస్తు, పాత బ్లాక్, నిమ్స్, పంజాగుట్ట, హైదరాబాద్ లో సంప్రదించాలని సూచించారు. అలాగే ఫోన్ 040-2348-9025 ద్వారా సంప్రదించాలన్నారు. అందుబాటులో ఉంటే పాత వైద్య రిపోర్టులు తమ వెంట తీసుకురావాలని సూచించారు.

# జార్ఖండ్‌లో జేపీఎస్సీ సెగ!




**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉద్యోగ నియామక పరీక్షల్లో భారీగా అక్రమాలు, తీవ్ర అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో వేలాది మంది విద్యార్థులు, అభ్యర్థులు నిరసనలు చేస్తున్న విషయం తెలిసిందే. గత రెండు వారాలకు పైగా జరుగుతున్న ఈ నిరసనలు సోమవారం తీవ్ర రూపం దాల్చింది. దీంతో పోలీసులు విద్యార్థులు, జేపీఎస్సీ అభ్యర్థులపై లాఠీలను, వాటర్ గన్, టియర్ గన్ లను ఉపయోగించారు. ఇదిలా ఉండగా.. ఈ వ్యవహారంలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న జార్ఖండ్ సీఐడీ అధికారులు జేపీఎస్సీ మాజీ ఛైర్మన్ ఎల్ ఖియాంగ్తే ను సోమవారం అరెస్టు చేశారు. ఈ విషయాన్ని జార్ఖండ్ సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ మనోజ్ కౌశిక్ అధికారికంగా ధృవీకరించారు. నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణలో భాగంగా ఈ అరెస్ట్ నమోదు చేసినట్లు వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ పొందిన అనంతరం ఎల్ ఖియాంగ్తే గత ఏడాది ఫిబ్రవరిలో జేపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే, సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ తో పాటు పలు ఉద్యోగ ప్రకటనల నిర్వహణలో అక్రమాలు జరిగాయని అభ్యర్థులు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర స్థాయిలో నిరసనలు వెల్లువెత్తాయి. కేసు తీవ్రత దృష్ట్యా, విచారణ నిష్పక్షపాతంగా జరిగేందుకు వీలుగా ఆయన జులై 22న తన ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఈ వ్యవహారంలో సీఐడీ ఇప్పటికే పలు చోట్ల సోదాలు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకోగా, మాజీ ఛైర్మన్‌ను అరెస్టు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో, నిరుద్యోగ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# పెద్ది విగ్రహంపై రగడ!



**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన గద్దెను మున్సిపల్ అధికారులు గత రాత్రి కూల్చివేశారు. దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. పెద్ది సంస్మరణ సభ అనంతరం మెడికల్ కాలేజీ పరిసరాలకు చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు.. కూల్చివేసిన ప్రదేశంలోనే మళ్లీ గద్దె నిర్మించి, పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని డీసీపీ అంకిత్‌కుమార్, ఏసీపీ రవీందర్‌రెడ్డి సమీక్షిస్తున్నారు. భారీగా పోలీసులు మోహరించారు. మరోవైపు మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూడా అక్కడికి చేరుకున్నారు. విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయా? లేదా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం మెడికల్ కాలేజీ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# యుద్ధానికి ట్రంప్ ఎండ్ కార్డ్!



**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** నెలల తరబడి కొనసాగుతున్న ఇరాన్, అమెరికా యుద్ధం ప్రపంచ దేశాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా ఈ యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరు అందరిని టెన్షన్ పెట్టిస్తున్న వేళ ట్రంప్ సంచలన నిర్ణయం దిశగా అడుగులు వేయబోతున్నట్లు అంతర్జాతీయ వార్త సంస్థ ది వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ఇరాన్‌తో పూర్తిస్థాయి కొత్త అణు ఒప్పందం కుదరకపోయినా యుద్ధం ముగించేందుకు సిద్ధం అవుతున్నారని ఇందుకోసం హోర్ముజ్ జలసంధిని పూర్తిగా పునఃప్రారంభిస్తే చాలు అనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి ద్వారా అంతర్జాతీయ నౌకాయానం పునరుద్ధరణే ప్రాతిపదికగా సైనిక దాడిని నిలిపివేసి, కాల్పుల విరమణను పొడిగించేందుకు ట్రంప్ సుముఖంగా ఉన్నట్లు అమెరికా అధికారులు వెల్లడించినట్లు ఈ కథనం పేర్కొంది.

మధ్యంతర ఎన్నికల కోసమే..

అయితే అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ రాజకీయంగా నష్టం జరగకుండా ట్రంప్ ఈ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతకాలం ఇరాన్ పై చేసి యుద్ధం ద్వారా ఏం సాధించామో ఓటర్లకు ట్రంప్ చెప్పుకోవాల్సిన పరిస్థితి ఉంది. ట్రంప్ తీరుపై ఇప్పటికే అమెరికన్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోందనే వార్తలు సైతం వచ్చాయి. ఎలాంటి సంబంధం లేకపోయినా ఇరాన్ తో యుద్ధానికి దిగి దేశ సైనిక సంపదను నాశనం పట్టిస్తున్నారని ట్రంప్ పై అమెరికట్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీనికి తోడు ఫిబ్రవరిలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసి, క్షిపణి, డ్రోన్ దాడులతో నౌకల రాకపోకలను అడ్డుకుంటోంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు విఘాతం కలగడమే కాకుండా అమెరికాలో పెట్రోల్ ధరలు పెరిగాయి. వీటన్నిటికి చెక్ పెట్టాలంటే ఇరాన్ యుద్ధాన్ని విరమించాలనే ఆలోచనకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

ఇరాన్ కఠిన నిబంధనలు..

ట్రంప్ ఆలోచన ఇలా ఉంటే జలసంధిని తెరవడానికి ఇరాన్ కీలక డిమాండ్లు అమెరికా ముందు ఉంచుతున్నది. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించి నౌకా దిగ్బంధం ఎత్తివేయాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అమెరికా సైన్యాన్ని గల్ఫ్ నుంచి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోంది.

# ట్రిబ్యునల్స్‌పై కేంద్రం కీలక నిర్ణయం!

మొదటి పేజీ తరువాయి

బిల్లు ఆమోదం పొందిన వెంటనే, ప్రతిపక్షాల నిరసనలు మిన్నంటడంతో లోక్‌సభను స్పీకర్ రేపటికి వాయిదా వేశారు.

న్యాయ వ్యవస్థను మరింత పటిష్టం చేయడం, కేసుల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గించడం, వివిధ రకాల ట్రిబ్యునళ్ల నిర్వహణను క్రమబద్ధీకరించడం ఈ బిల్లు యొక్క ప్రధాన లక్ష్యం. దేశంలోని వేర్వేరు ట్రిబ్యునళ్ల అధ్యక్షులు, సభ్యుల అర్హతలు, నియామక ప్రక్రియలు, పదవీ కాలం, సేవా నిబంధనలలో స్పష్టమైన ఏకరూపతను తీసుకురావడానికి ఇది దోహదపడుతుంది. దీనివల్ల ప్రతి ట్రిబ్యునల్‌లో ఒకే రకమైన నిబంధనలు అమలులోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా అప్పీలేట్ ట్రిబ్యునళ్ల పనితీరును సమీక్షించి, సరిగా పనిచేయని లేదా అనవసరమైన ట్రిబ్యునళ్లను రద్దు చేసి వాటి బాధ్యతలను నేరుగా హైకోర్టులకు లేదా పౌర న్యాయస్థానాలకు బదిలీ చేస్తారు.

ఇది అనవసరపు పరిపాలనా ఖర్చులను తగ్గించి ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా, నియామకాల పరిశీలన మరియు ట్రిబ్యునళ్ల స్వతంత్రతను కాపాడటానికి ఒక కేంద్రీకృత వ్యవస్థగా 'నేషనల్ ట్రిబ్యునల్స్ కమిషన్' ఏర్పాటుకు బాటలు వేస్తుంది. ఫలితంగా న్యాయ సేవలలో పారదర్శకత పెరిగి, ప్రజలకు త్వరితగతిన న్యాయం లభిస్తుంది.

# పాలమూరుకు కేంద్రం షాక్!

**న్యూస్ డెస్క్, 10 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కు జాతీయ హోదా కల్పించడంపై కేంద్ర కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రజలు ఎంతో ఎదురు చూస్తున్న ఈ ప్రాజెక్టు పై కేంద్రం స్పందిస్తూ.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చే ప్రతిపాదన ఏది ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రకటన చేసింది. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర వివాదాల అంశాలు ప్రస్తుతం ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నందున ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 'టెక్నో ఎకనామిక్ అప్రైజల్' (సాంకేతిక-ఆర్థిక అధ్యయనం) ప్రక్రియను ప్రస్తుతం చేపట్టలేమని కేంద్రం స్పష్టం చేసింది. అంతేకాకుండా, తెలంగాణ ప్రభుత్వం మరింత సమగ్రమైన ప్రణాళికతో రావలసి ఉందంటూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సమగ్ర నివేదికను కేంద్రం తిరిగి వెనక్కి పంపించింది.

కృష్ణా నీటి కేటాయింపులపై స్పష్టత వచ్చే వరకు ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అందించే ఆర్థిక సహాయం విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) నిబంధనలకు అనుగుణంగా అన్ని రకాల అనుమతులు, క్లియరెన్స్ సాధించిన తర్వాతే జాతీయ హోదా ప్రాజెక్టుల పురోగతి సాధికార కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదాపై కేంద్రం చేసిన ఈ సంచలన ప్రకటనతో తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఏపీలో ఎన్నికల సందడి!

మొదటి పేజీ తరువాయి



ఇదిలా ఉండగా.. సమీప గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో విలీనం చేసేందుకు తీసుకొచ్చిన చట్టం-5ను సవాల్ చేస్తూ హైకోర్టులో 35 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. కోర్టు ఆదేశాల నేపథ్యంలో 2021లో 23 పురపాలికలు, నగర పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించలేదు. తాజాగా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థతో పాటు శ్రీకాళహస్తి, కావలి, ఆలూరు పురపాలికలు, నగర పంచాయతీలకు సంబంధించిన కొన్ని రిట్ పిటిషన్లు ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన కేసులను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పురపాలక శాఖ వెల్లడించింది.

మరోవైపు రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ కూడా సన్నద్ధత వ్యక్తం చేసింది. 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించింది. వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాలను ప్రచురించి ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నట్లు తెలిపింది. అయితే కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల సుమారు 100 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోవచ్చని పంచాయతీరాజ్ శాఖ పేర్కొంది. 2021 ఎన్నికల సమయంలో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా 354 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో సుమారు 13,100 పంచాయతీలకే ఎన్నికలు జరిగాయి. మొత్తంగా పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన వివాదాలు పరిష్కారమై, వార్డులు, డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పూర్తయితే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం, సంబంధిత శాఖలు సిద్ధంగా ఉన్నట్లు ఎస్ఈసీకి స్పష్టత ఇచ్చాయి. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై మరోసారి కదలిక మొదలైనట్లు తెలుస్తోంది.

# డీఎస్సీ రగడ.. బాబు ఫైర్!

మొదటి పేజీ తరువాయి

రోడ్లపై స్వైరవిహారం చేస్తే సహించను

అనవసర ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడాన్ని ప్రభుత్వం సహించదని చంద్రబాబు స్పష్టం చేశారు. రోడ్లన్నీ కొందరు స్వైరవిహారం చేయడానికి, ఇష్టానుసారంగా వ్యవహరించడానికి ఉన్నాయా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తాను మౌనంగా ఉంటే ఎవరినీ నిద్రపోనివ్వరని, రోజూ రౌడీయిజం చేసే పరిస్థితులు వస్తాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. భోగాపురం విమానాశ్రయం విషయంలోనూ రాజకీయంగా క్రెడిట్ తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. భోగాపురం తానే నిర్మించానని కొందరు చెప్పుకుంటున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత కూడా దానిని తానే పూర్తి చేశానని చెప్పుకునే పరిస్థితి వస్తుందని, రేపు అమరావతి పూర్తయితే అది కూడా తానే నిర్మించానని చెప్పుకునే అవకాశం ఉందని విమర్శించారు.

తాను రౌడీయిజం చేయనని చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే రౌడీలకు మాత్రం సింహ స్వప్నంగా ఉంటానని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అడ్డుకోవడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు ఏపీ సీఎం చంద్రబాబు.. కాగా, డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోన్న విషయం విదితమే..

# తమిళ తాయ్ వాజ్తుకు గౌరవం

మొదటి పేజీ తరువాయి

ఇటీవలే వివాదం:

కాగా, గత నెలలో రాష్ట్రంలోని మనోన్మానియం సుందరనార విశ్వవిద్యాలయం 33 వ స్నాతకోత్సవాన్ని రాష్ట్ర గీతం తమిళ్ తాయ్ వాజ్తుకు బదులుగా జాతీయ గీతం 'వందేమాతరం'తో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీతాన్ని మూడవ స్థానంలో ఆలపించడం రాజకీయంగా వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో తమిళ్ తాయ్ వాజ్తును ప్రారభంలోనే ఆలపించే సాంప్రదాయాన్ని కొనసాగించాలని కోరుతూ తమిళనాడుకు చెందిన 21 మంది పార్లమెంట్ సభ్యులు ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి (ఆర్లేకర్) కు ఉమ్మడిగా ఒక లేఖ రాశారు. ఈ క్రమంలో తాజాగా అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెట్టగా అన్ని పార్టీలో ఒకే అభిప్రాయం వ్యక్తం చేశాయి. దీంతో ఇకపై తమిళనాడులో అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యక్రమాలు తమిళనాడు రాష్ట్ర గేయంతోనే ప్రారంభం కానున్నాయి.

# వేపరాల లో స్మార్ట్ కిచెన్ ప్రారంభం

## స్మార్ట్ కిచెన్ ప్రారంభంలో కడపజిల్లా టిడిపి అధ్యక్షుడు భూపేష్ రెడ్డి..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 10: మైలవరం మండలం.. వేపరాల గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో ఫేస్ టు క్రింద కడపజిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వినూత్న ఆలోచనతో నిర్మించిన స్మార్ట్ కిచెన్ ను కడపజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి, జమ్మలమడుగు ఆర్డిఓ శిరీష, ఎంఈఓ చిట్టిబాబు, ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి భూపేష్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు దినచర్యలో భాగంగా పౌష్టికంగా ఆహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వేపరాల స్మార్ట్ కిచెన్ నుండి మైలవరం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు మరియు హైస్కూల్ కు భోజనం సరఫరా అవుతుంది అన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల అభివృద్ధి, సంక్షేమం, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకుల ఆధ్వర్యంలో పాల్గొని డోర్ టు డోర్ ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం రెండు కల్లల భావించి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని, సంక్షేమ పథకాలు అన్నిటిని సమయస్ఫూర్తితో ప్రజలకు అందిస్తుందని, ప్రజలను ఉద్దేశించి భూపేష్ రెడ్డి తెలియజేశారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలాగా పరిగెత్తిస్తున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మనోహర్ రెడ్డి, ఎండిఓ సోమశేఖర్ రెడ్డి , జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, బీసీ ప్రధాన కార్యదర్శి కొండయ్య, మండల అధ్యక్షుడు పాపిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గురప్ప, రంగనాయకులు, నరసింహారెడ్డి, కుమార్, నారాయణ, కొండయ్య, రామచంద్రుడు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లికార్జున, యూనిట్, బూత్ లెవెల్ టిడిపి ఇన్చార్జులు, ఉపాధ్యాయులు, అధికారులు, పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో భారీ కోత!

మొదటి పేజీ తరువాయి

ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. వచ్చే నెల 17 నుంచి అక్టోబరు 15 వరకు నోటీసులు ఇవ్వడం, అభ్యంతరాలను పరిష్కరించడం చేస్తారు. అక్టోబరు 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448ఓటర్లు ఉండగా, ఇందులో ఇప్పటి వరకు 2,64,30,494 ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించారు. 2.80 లక్షలు షిఫ్టింగ్, చనిపోయిన వారు, స్థానికంగా లేని వారిని, ఒకరికి రెండు చోట్ల ఉన్న వారు 3.13లక్షల ఓటర్లుగా గుర్తించారు. మరొక 73,95,954 మంది ఓటర్లు ఇంత వరకూ ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వలేదని తేల్చారు. దీంతో మొత్తం 74 లక్షల వరకు ఓటర్లు ఓటరు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలో 19.61లక్షలు, మేడ్చల్ జిల్లాలో 10.77లక్షలు, రంగారెడ్డి జిల్లాలో 12.98లక్షల ఓట్లు తొలగనున్నాయి. సంగారెడ్డి, వికారాబాద్, కరీంనగర్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో రెండు లక్షలకు పైగా ఓట్లు తొలగించనున్నారు. ఒక వేళ కొందరు ముసాయిదా జాబితాపై ఏమైనా అభ్యంతరాలు వచ్చినా కనీసం 70 లక్షల వరకు ఓట్లు తొలగించాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వివిధ ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి, ఉద్యోగ, విద్య, వ్యాపార అవకాశాలకు ఇక్కడికి వచ్చిన వారు తమ సొంత ప్రాంతంలోనే ఓటు హక్కును కొనసాగించడానికి మొగ్గు చూపారని ఎన్నికల సంఘం లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

ముసాయిదా తరువాత..

రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. బీఎల్‌వోలకు సరైన అవగాహన లేకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల సంఘం సూచనలకు కనీస అవగాహన లేకపోవడం, కనీస విద్యార్హతలేని వారిని బీఎల్‌వోలుగా నియమించడంతో ఎస్ఐఆర్ పక్రియపై తీవ్రస్థాయిలో విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 74 లక్షలకు పైగా ఓటర్లను తొలగించే అవకాశాలు ఉండటంతో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ తరువాత తీవ్ర విమర్శలు, ఆరోపణలు వ్యక్తమయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. తెలంగాణ కంటే జనాభా పరంగా పెద్ద రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 40 లక్షల ఓట్లు మాత్రమే తొలగించగా ఇక్కడ మాత్రం ఏకంగా 74లక్షల ఓట్లు పోతే రాజకీయంగా తీవ్ర విమర్శలను ఎదుర్కొనే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

# “కడప” ను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి..!

### జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 10: వికసిత భారత్, స్వర్ణాంధ్ర -2029 లక్ష్యాలను అధిగమిస్తూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల స్ఫూర్తితో.. కడపను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జేసీ డా. నిధి మీనా.. డిఆర్వో మల్లికార్జునుడు తో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో జేసీ డా. నిధీమీనా మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. వికసిత భారత్ లక్ష్యాలను అధిగమిస్తూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల స్ఫూర్తితో.. వైఎస్ఆర్ కడప జిల్లాను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థపై అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. పీజీఆర్ఎస్ పై ప్రజల అభిప్రాయాలను తప్పక స్వీకరించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సమస్యలకు తావులేని స్వేచ్ఛాయుత జీవనాన్ని జిల్లా ప్రజలకు అందించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా 2029 రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలపై దృష్టి సారించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యలు, ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ సాగు విధానాలపై జిల్లా ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచాలని జేసీ అధికారులకు సూచించారు. ఇందుకోసం నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈవో సుబ్రహ్మణ్యం, ఎస్డీసీ వెంకటపతి, డిప్యూటీ కలెక్టర్లు శివరామిరెడ్డి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్...!!

### తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు.

### 28,51,050 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు.

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 10: రాజంపేట పట్టణ, నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం నాడు అనారోగ్యంతో బాధపడే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక ఆపన్న హస్తమని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు అనారోగ్యంతో బాధపడుతున్న 41 మందికి దాదాపు 28,51,050 మరియు 3 ఎల్ఓసి చెక్కులను సీఎంఆర్ఎఫ్ చెక్కులను జగన్ మోహన్ రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ.. నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జగన్ మోహన్ రాజు తెలియజేసారు. కార్పొరేట్ ఆసుపత్రిలో కూడా పేదవాడు నాణ్యమైన వైద్యం పొందవచ్చునని, పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ఆశయమని, ఆపన్నులకు సీఎం సహాయనిది చెక్కులు వరమని, దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి సిఎం సహాయనిధి సాయాన్ని ముఖ్యమంత్రి మంజూరు చేస్తున్నారని చమర్తి జగన్ తెలియజేశారు. ముఖ్యమంత్రి ఆర్థిక సహాయం పట్ల చంద్రబాబుకు, నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు కు పలువురు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# జీవితంలోనే కాదు, మరణంలోనూ నిన్ను విడిచి ఉండలేను.!!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 10: మరణం.. అమర బంధం.. ప్రేమే అమరం.. బంధమే శాశ్వతం. జీవితం అంటే కేవలం పుట్టడం.. పెరగడం.. చనిపోవడమా.! కాదు.. కాదు.. అది ఒక పవిత్రమైన ప్రయాణం. ఒక మధురానుభవం, వీడని ఒక బంధం.!కొంతమంది జీవితాలు మనకు పాఠాలు నేర్పుతాయి.. మరికొంతమంది జీవితాలు మనకు స్ఫూర్తిగా నిలుస్తాయి. రాయలసీమ సంస్కృతి సాక్షిగా, పసుపు పంటల పుణ్యభూమి దువ్వూరులో నివసించిన ఇరగంరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఆయన సతీమణి నారాయణమ్మల జీవితాలు సరిగ్గా అలాంటివే.

దాదాపు ఐదు దశాబ్దాల (అరశతాబ్దం) కిందట ఒకటైన ఈ దంపతుల ప్రయాణం ఎంతో ఆదర్శవంతమైనది. వెంకట్రామిరెడ్డి ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి నలుగురికీ అక్షర జ్ఞానాన్ని పంచితే, నారాయణమ్మ ఇల్లాలై ఆయన ప్రతి అడుగులో తోడుగా నిలిచారు. వారి ప్రేమకు ప్రతీకగా పెరిగిన ముగ్గురు సంతానాన్ని క్రమశిక్షణతో పెంచారు. ఉన్నత శిఖరాలకు చేర్చారు. ఆ పిల్లలు హైదరాబాదులో ఉన్నతంగా స్థిరపడ్డారు. తమ శేష జీవితాన్ని పిల్లల ప్రేమే ఊపిరిగా, ఒకరికొకరు తోడుగా గడిపారు. దాంతో కాలచక్రంలో వయోభారం కారణంగా వెంకట్రామిరెడ్డి (79) కన్నుమూశారు. ఆ అక్షర యోధుడి శ్వాస ఆగిందన్న వార్త విన్న మరుక్షణమే.. ఆయన సతీమణి నారాయణమ్మ (68) గుండె నిలువునా చీలిపోయింది. జీవితంలోనే కాదు, మరణంలోనూ నిన్ను విడిచి ఉండలేను అన్నట్లుగా ఆ క్షణానే ఆమె కూడా ప్రాణాలు విడిచారు. ఒకే ఇంట్లో రెండు మృతదేహాలు, ఒకేసారి అనంతలోకాలకు పయనమైన ఆ దంపతులను చూసి దువ్వూరు ప్రజానికం శోకసముద్రంలో మునిగిపోయింది. ప్రేమే జీవితానికి పరమార్థమని, చావు కూడా విడదీయలేని అమర బంధం వీరిదని వారు నిరూపించారు. దేహాలు మట్టిలో కలిసినా, వారి ప్రేమ, బంధం మాత్రం ఈనేల ఉన్నంతవరకు శాశ్వతంగా నిలిచిపోతుంది. అని చెప్పడానికి ఇరగం రెడ్డి వెంకట్రాంరెడ్డి మరణం సాక్ష్యంగా నిలబడిందని చెప్పుతున్న దువ్వూరు ప్రజానికం.

# నేడు రాపూరులో డైల్ యువర్ డి.యం.



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్ ):- నేడుఅనగా 11-08-2026వతేది మంగళవారం రాపూరు డిపో నందు ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఉదయం 10:00గంటల నుంచి11:00గంటల వరకు “డైల్ యువర్ డి.యం.” కార్యక్రమం నిర్వహించబడును అని ఈ పోగ్రామ్ నందు ప్రయాణికులు9959225651 నెంబర్ కు ఫోన్ చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని డిపో మేనేజర్ వై.అనీల్ ప్రకటనలో తెలిపారు.

# వర్షాల కోసం వరుణయాగం

### పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం దంపతులు



నల్లగొండ (బిఎన్ఎస్): దేశ, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్ వద్ద కృష్ణా నది తీరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది.. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నలుమూలల నుండి వచ్చిన 108 మంది రుత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 4 గంటల 5 నిమిషాలకు రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా వరుణ యాగం ప్రారంభమై సాయంత్రం 3 గంటల 24 నిమిషాలకు పూర్ణాహుతితో ముగిసింది.. ఉదయం ఋత్వికులు, అర్చకుల వేదమంత్ర మంత్రోచ్చారణల నడుమ గోపూజతో యాగాన్ని ప్రారంభించి, యాగ ప్రదక్షిణము, పుణ్యా వచనం, అంకురార్పణం,ఋష్యశృంగ పూజ, తదితర పూజలతో కొనసాగింది... కృష్ణానది ఒడ్డున చతుర్విధ పారాయణం తో నిర్వహించిన ఈ యాగం లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దంపతులు పూర్ణాహుతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దంపతులకు పూర్ణకుంభంతో, యాగశాల వద్దకు మేళా తాళాల తో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి దంపతులు వరుణ యాగం లో పాల్గొని పూర్ణాహుతి గావించి యాగాన్ని ముగించారు.

యాగ నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది.. యాగశాల సమీపంలోకి ముఖ్యులు , ప్రత్యేక పాసులు ఉన్న వారిని మాత్రమే అనుమతించారు.. యాగం తిలకించేందుకు వచ్చిన ప్రజలు స్థానికుల కోసం కొద్ది దూరంలో పెద్ద ఎత్తున ఎల్ఈడి తెరలు, ప్రవచనాలు ఏర్పాటు చేశారు..

అంతకుముందు సాగర్ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, పలువురు. ఇతర ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

ఈ వరుణ యాగంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ,రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,మరో విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు శంకర్ నాయక్,రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి ,ప్రభుత్వ సలహాదారు లు కే కేశవ రావు ,సుదర్శన్ రెడ్డి ,మాజీ మంత్రి జనా రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్,ఎస్ పి శరత్ చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,

నాగార్జున సాగర్ ఎం ఎల్ ఏ కుందూరు జయవీర్ రెడ్డి, ఆలేరు,భువనగిరి,తుంగతుర్తి,మిర్యాలగూడ,దేవరకొండ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి , బాలునాయక్, తో పాటు పాల కార్పొరేషన్ చైర్మన్లు,మున్సిపల్ చైర్మన్లు, పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు...

# కండలేరు ముంపు వాసులకు జీవో నెంబర్ 98 ద్వారానే ఉద్యోగాలు ఇవ్వాలి-మిడతల రమేష్



నెల్లూరు జిల్లా నెల్లూరు(బిఎన్ఎస్ ):-భూ సేకరణ యాక్ట్ 2013 కండలేరు డ్యామ్ వాసులకు వర్తించదు. తెలంగాణ డిప్యూటీ ఎస్ ఈ రవి శేఖర్ రెడ్డికి బిజెపి నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు జలాశయం నిర్మాణ సమయంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఇంటికొక ఉద్యోగం హామీ ఇచ్చారు అని

ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో భిన్న ధోరణలు అధికారులు అనుకరిస్తున్నారు అని తెలిపారు.

అదేవిధంగా కండలేరు అవార్డుదారులు 1985- 1994 మధ్యకాలం కు చెందినవారు .. జీవో నెంబర్ 98.. జీవో నెంబర్ 324....జీవో నెంబర్ 30... ల ప్రకారం కండలేరు ముంపు వాసులకు ఉద్యోగ కల్పన సదుపాయం ఉంది..

2013 భూసేకరణ యాక్టు ప్రకారం భూమి కోల్పోయిన వారికి ఉద్యోగ సదుపాయం లేదు.. కేవలం పరిహారం మాత్రమే ఉంది.అదేవిధంగా

జీవో నెంబర్ 98 నలభై సంవత్సరాల నాటిదని.. కండలేరు ముంపు ప్రజలను 2013 యాక్ట్ తో సరిపోల్చడం అంటే వారి జీవన హక్కులను కాలరాయడమే అవుతుంది..ఏ విధంగాను 2013 యాక్ట్ కండలేరు వాసులకు న్యాయం చేయలేదు. ముంపు నిరుద్యోగులు తెచ్చుకున్న హైకోర్టు తీర్పులను సైతం జిల్లా ఉన్నతాధికారులు గౌరవించడం లేదు అని తెలిపారు.అదేవిధంగా ఒకే జిల్లాలో సోమశిల డ్యాం ముంపు వాసులకు సంపూర్ణ న్యాయం జరిగేలా... కండలేరు జలాశయం ముంపు వాసులకు కేవలం అన్యాయం జరిగేలా ఒకే రాష్ట్ర ప్రభుత్వం ద్వంద ప్రమాణాలు అనుసరించడం బాధాకరం..

కండలేరు ముంపు వాసులను 2013 యాక్ట్ తో సరిపోల్చడం అంటే ముంపు వాసులు గొంతు కోయడమే అవుతుంది.అదేవిధంగా

జీవో నెంబర్ 98 ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలని బిజెపి నేత రమేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కందికట్ల రాజేశ్వరి. నరాల సుబ్బారెడ్డి. గండికోట రఘురామయ్య. విజయ్ శ్రీ. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# సైలెన్సర్ పీకేయడం మాత్రమే కాదు..

### యువతను ప్రమాదాల నుంచి కాపాడటమే అసలు లక్ష్యం



అమలాపురం (బిఎన్ఎస్)ఆగస్టు 10: జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో మార్పులు చేసి, ముఖ్యంగా అధిక శబ్దం చేసే సైలెన్సర్లను అమర్చుకుని రోడ్లపై హల్‌చల్ చేస్తున్న వాహనాలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. యువతలో కొందరు బైక్‌లను ప్రత్యేకంగా మోడిఫై చేయించుకుని పెద్ద శబ్దాలు వచ్చే సైలెన్సర్లను ఉపయోగించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడంతో పాటు, వేగంగా వాహనాలు నడపడం, ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నారు.

రాజోలు, అమలాపురం, అయినవిల్లి, కొత్తపేట, రావులపాలెం తదితర ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన వాహనాలను గుర్తిస్తున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అనధికారికంగా అమర్చిన సైలెన్సర్లను తొలగించి పోలీసుల ఆధీనంలో ఉంచుతున్నారు. అయితే ఈ చర్యల్లో కేవలం కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడం మాత్రమే కాకుండా యువతకు అవగాహన కల్పించడం, మరోసారి ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా హెచ్చరించడం కూడా ప్రాధాన్యత పొందుతోంది.

అయినవిల్లిలో ఎస్ఐ జ్యోతి వాహనదారులకు హెల్మెట్ వినియోగం, రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సమయంలో ఒక యువకుడు పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. సదరు యువకుడు రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తిగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఈ విషయంపై అధికారికంగా నిర్ధారించని అంశాలను పక్కనపెడితే, విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారితో అతను వాగ్వాదానికి దిగిన ఘటన మాత్రం చర్చనీయాంశమైంది.

ఈ వ్యవహారంలో పరిస్థితిని మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉన్నప్పటికీ, యువకుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మహిళా ఎస్ఐ తొలుత కఠినంగా హెచ్చరించి వదిలిపెట్టినట్లు సమాచారం. మరోవైపు విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులపై దురుసుగా వ్యవహరించిన ఘటనను ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని చట్టపరమైన చర్యలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే చివరకు యువకుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్షమించి వదిలేసినట్లు సమాచారం.

# హైదర్‌షాకోట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతి




హైదరాబాద్: హైదర్‌షాకోట్‌లోని ఎస్ఎంపీ స్కూల్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన మహీంద్రా SUV 350 కారు రోడ్డుపై వెళ్తున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిని ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.ంకారు ఢీకొట్టిన తీవ్రతకు బాధితుడు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడినట్లు స్థానికులు తెలిపారు. ఇదే సమయంలో రాపిడో బైక్‌పై వెళ్తున్న మరో ఇద్దరిని కూడా కారు ఢీకొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి కాలు విరిగినట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదం అనంతరం కారులో ఉన్న నలుగురు యువకులు వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. కారు నంబర్ ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించగా, వాహనం శంషాబాద్‌కు చెందినదిగా గుర్తించినట్లు సమాచారం.

సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి అతివేగమే కారణమా, డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.





# సినిమా న్యూస్



## కిరణ్ అబ్బవరం 'ఇంద్రపుత్ర'

యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. తాజాగా ఆయన నటిస్తున్న కొత్త చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మెరుపులు, భారీ కొండలు, యాక్షన్ అంశాలను ప్రతిబింబించేలా ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. దీంతో సినిమాపై ఆసక్తి నెలకొంది. 'ఇంద్రపుత్ర' చిత్రానికి శ్రీకాంత్ పుప్పల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్నారు. కీర్తన్ కథ అందించగా.. తాన్వీ ఎన్. దత్తా రచన చేస్తున్నారు. కీర్తన్, కుసుమ్ అరోరా సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మాతలుగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కిరణ్ అబ్బవరం నటిస్తున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కాగా, 'ఇంద్రపుత్ర'ను 2027లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.



## సంక్రాంతికి మెగా జోరు

మెగా హీరో సాయి ధరమ్ తేజ్ 'సంబరాల ఏటిగట్టు' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తున్నాడు. 'హనుమాన్' లాంటి బ్లాక్ బస్టర్ సినిమాతో ఇండియాన్ షేక్ చేసిన ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విజువల్ వండర్‌గా రాబోతున్న ఈ సినిమాలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకోంటున్న ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ అప్డేట్ నెట్టింట దర్శనమిచ్చింది. సంబరాల ఏటిగట్టు చిత్రాన్ని 2027 సంక్రాంతి పండుగ కానుకగా విడుదల చేసేందుకు జనవరి 12వ తేదీని పరిశీలిస్తున్నారని ఫిలిమ్ వర్గాల నుంచి వార్తలు వస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ దాదాపుగా పూర్తి కావస్తున్నట్లు తెలుస్తుండగా.. సంక్రాంతికే రిలీజ్ చేయాలని గట్టి ప్లాన్‌లో ఉన్నారట. అంతే కాకుండా.. 2024 సంక్రాంతికి చిత్రం కూడా జనవరి 12నే విడుదలైంది.. కాబట్టి నిరంజన్‌రెడ్డి నిర్మాణ సంస్థకు ఇది ఒక ప్రత్యేకమైన తేదీ కాబోతుందని ఈ డేట్‌నే ఫిక్స్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట. మరి వైరల్ అవుతున్న ఈ వార్తల్లో ఎంత వరకు నిజం ఉందో తెలియాలంటే అఫీషియల్ అప్డేట్ వచ్చే వరకు వేచి చూడాల్సి ఉంది.

## చిరుతో మీనాక్షి చాన్స్





మెగాస్టార్ చిరంజీవి హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో ప్రస్తుతం 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో మోస్ట్ బ్యూటిఫుల్ నటి మీనాక్షి చౌదరి భాగం కాబోతున్నట్లు, ప్రస్తుతం ఆమెతో మేకర్స్ మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మీనాక్షి ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రలో కాకుండా ఓ గెస్ట్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఆమెకు సంబంధించిన సన్నివేశాలు సెకండాఫ్‌లో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఈ సినిమాలో అసలు హీరోయిన్ పాత్ర ఉంటుందా? లేదా? అనే ఆసక్తి కూడా ప్రేక్షకుల్లో నెలకొంది. ఎస్ఎస్ తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం.

## అజిత్‌తో శంకర్?



తమిళ స్టార్ దర్శకుల పేర్లలో శంకర్ ఒకప్పుడు అగ్రస్తానంలో ఉండేవారు. శంకర్ తో సినిమా చేసేందుకు స్టార్ హీరోలు ఎదురుచూసేవాళ్లు. కానీ అదంత గతం. స్నేహితుడు, భారతీయుడు 2, ఐ, గేమ్ ఛేంజర్ వంటి ఫ్లాప్స్ తో శంకర్ తో సినిమా చేసేందుకు భయపడుతున్నారు స్టార్ హీరోలు. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ మరియు సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో ఒక భారీ చిత్రం రూపుదిద్దుకోనుందనే వార్త ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'టూరింగ్ టాకీస్' కథనం ప్రకారం, వీరిద్దరి కాంబోలో ఒక మైండ్ బ్లోయింగ్ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉందని తెలుస్తోంది.

ప్రస్తుతం అజిత్ కుమార్ గుడ్ బ్యాడ్ అగ్లీ దర్శకుడు ఆధిక్ తో 'డేర్ డెవిల్' సినిమా ప్రకటించారు. ఈ సినిమాను స్వయంగా నిర్మిస్తున్నాడు. దాంతో పాటు 'మంకాతా 2: కూడా లైన్ లో ఉంది. ఈ రెండు చిత్రాల షూటింగ్ పూర్తయిన తర్వాతే శంకర్‌తో ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. ఈ లోపు కథ, బడ్జెట్ మరియు ఇతర అంచనాలు సరిగ్గా కుదిరితే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. దర్శకుడు శంకర్ గత చిత్రాలైన 'ఇండియన్ 2', 'గేమ్ ఛేంజర్' భారీ పరాజయంతో శంకర్ డ్రీమ్ ప్రాజెక్ట్ 'వేల్ పారి' కథకు నిర్మాతలు భారీ బడ్జెట్ కేటాయించేందుకు ప్రస్తుతం కొంత వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. అందువల్ల 'వేల్ పారి' ని కాస్త పక్కన పెట్టి, అంతకంటే ముందే అజిత్‌తో ఒక రీజనబుల్ బడ్జెట్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని శంకర్ భావిస్తున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## 'గౌరీ హెగ్డే'గా టబు





కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్' పై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ప్రకటించినప్పటి నుంచే విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కలయికపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో వేగం పెంచుతూ కీలక అప్డేట్స్‌ను విడుదల చేస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతితో పాటు సంయుక్త, దునియా విజయ్, సీనియర్ నటి టబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో టబు కనిపించిన తీరు, ఆమె పాత్రను డిజైన్ చేసిన విధానం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

ఈ చిత్రంలో టబు 'గౌరీ హెగ్డే' అనే పాత్రలో కనిపించనున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే ఆమె పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఎవరి మాటను పెద్దగా పట్టించుకోకుండా, తనకు నచ్చిన నిర్ణయం తీసుకుని దూసుకెళ్లే ఓ స్ట్రాంగ్ ఆఫీసర్ పాత్రలో టబు కనిపిస్తున్నారు. టబు బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్క్రీన్ ప్రెజెన్స్‌కు తగ్గట్టుగా గౌరీ హెగ్డే పాత్రను పూరి జగన్నాథ్ డిజైన్ చేసినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా ఆమె పాత్రలోని ఆత్మవిశ్వాసం, దూకుడు సినిమాకు కీలకంగా నిలవబోతున్నాయనే ఆసక్తి కలుగుతోంది. గ్లింప్స్ మొత్తాన్ని ఇంటెన్స్‌గా చూపించడంతో టబు పాత్ర చుట్టూ కథలో ఏదైనా కీలకమైన మలుపు ఉంటుందా? అనే చర్చ మొదలైంది.

పూరి జగన్నాథ్ సినిమాల్లో హీరో పాత్రలతో పాటు బలమైన సైడ్ క్యారెక్టర్స్‌కు కూడా ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంటుంది. 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్'లో టబు పాత్రను కూడా అదే తరహాలో ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. విజయ్ సేతుపతి పాత్రకు, టబు పోషిస్తున్న గౌరీ హెగ్డే పాత్రకు మధ్య ఎలాంటి సంబంధం ఉంటుంది? కథలో ఆమె ఎలాంటి మలుపులకు కారణమవుతారు? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు.మరోవైపు సంయుక్త, దునియా విజయ్ కూడా ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీంతో కథలో పలు బలమైన పాత్రలు, వాటి మధ్య సంఘర్షణతో సినిమా సాగనుందని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్, జేబీ నారాయణరావు కొండ్రొల్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హర్షవర్ధన్ సంగీతం అందిస్తున్నారు. భారీ యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## స్పైడర్ మ్యాన్ సునామీ




హాలీవుడ్ సూపర్‌హీరో మూవీ "స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే" భారత బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను రాబట్టుకుంటున్న ఈ సినిమా, దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రంగా నిలిచి సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకుంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఇప్పటివరకు భారత బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.462 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించి ట్రేడ్ పండితులను సైతం విస్మయానికి గురిచేసింది. భారతీయ మార్కెట్‌లో హాలీవుడ్ సినిమాలకు ఉన్న ప్రాభవాన్ని, ముఖ్యంగా స్పైడర్ మ్యాన్ పాత్రకు ఉన్న అపారమైన ప్రజాదరణను ఈ బాక్సాఫీస్ సునామీ మరోసారి చాటిచెప్పింది.

ఇప్పటివరకు భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రంగా జేమ్స్ కేమరూన్ విజువల్ వండర్ 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' పేరిట ఉన్న ఆల్-టైమ్ రికార్డును 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' అధిగమించి అగ్రస్థానానికి చేరుకుంది. భారతీయ ప్రేక్షకులు సూపర్‌హీరో కథలకు, విజువల్ ఎఫెక్ట్స్‌కు ఇచ్చే ప్రాధాన్యతను ఈ విజయం ప్రతిబింబిస్తోంది. థియేటర్లలో ఈ సినిమా సాధిస్తున్న భారీ కలెక్షన్లు, వీకెండ్లలో నిండుతున్న హౌస్‌ఫుల్ బోర్డులు భారతీయ బాక్సాఫీస్ చరిత్రలోనే హాలీవుడ్ సినిమాల రికార్డులను తిరగరాశాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలు మరియు ఆకట్టుకునే కథనంతో రూపొందిన ఈ చిత్రం, సరికొత్త కలెక్షన్ల రికార్డులతో భారతీయ సినిమా మార్కెట్‌లో హాలీవుడ్ లీడర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.